బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే!

చారిత్రక ఆధారాలు చూపించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
కోర్టు తీర్పు మేరకు గేట్లు, బోర్డులను తొలగించామని స్పష్టీకరణ

హైడ్రా కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త: అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ముమ్మాటికీ చెరువే అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఇందుకు సంబంధించి శాటిలైట్, గూగుల్ మ్యాప్స్‌తో చారిత్రక ఆధారాలను చూపించారు. ఈమేరకు శనివారం హైడ్రా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైడ్రా చేపట్టిన పలు కార్యక్రమాలను వివరిస్తూనే.. బతుకమ్మ కుంట పై వస్తున్న వదంతులపై వివరణ ఇచ్చారు. 1975లో ఇరిగేషన్ రికార్డుల్లో కుంటగా పేర్కొన్న ఆధారాలను చూపించారు. సర్వే నంబరు 563/1 లో 9.19 ఎకరాల వరకూ చెరువున్నట్టు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ రికార్డులు వెల్లడించాయన్నారు. ఆ చెరువుకు కట్ట 563/2 సర్వే నంబరులో 6 గుంటల మేర మాసాన్ కట్ట పేరిట ఉందన్నారు. గ్రామ రికార్డులతో పాటు.. 1971లో సర్వే ఆఫ్ ఇండియా ఫొటోలు, 1989లో నాసా (ల్యాండ్‌శాట్) రూపొందించిన శాటిలైట్ పిక్చర్స్‌ను మీడియాకు విడుదల చేశారు. ఈ ఫొటోలు, వీడియోలను సరిపోల్చుతూ రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. బతుకమ్మ కుంటపై తుది తీర్పు వచ్చే వరకూ దీనిమీద ఎవరూ ఓనర్‌షిప్ క్లెయిమ్ చేయకూడదనే నిబంధనల మేరకు బోర్డులు, గేట్లు తొలగించామని చెప్పారు. చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తే ప్రమాదాలు జరుగుతాయని సుప్రింకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలిపామన్నారు. వివరణతో 3 వారాల్లో అఫడవిట్‌ను దాఖలు చేయమని సోమవారం సుప్రిం కోర్టు సూచించిందని తెలిపారు. బండ్లగూడ మండలం, విలేజ్‌లోని సల్కం చెరువు విషయంలో కూడా కోర్టు హైడ్రాను తప్పు పట్టలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వివరాలు హైడ్రా కోరిన విషయాన్ని కూడా హైకోర్టు తీర్పులో పేర్కొందని.. ఇరిగేషన్, రెవెన్యూ నుంచి వచ్చిన నివేదిక మేరకు చర్యలుంటాయని కమిషనర్ స్పష్టం చేశారు.

చెరువులు ప్రజల సొత్తు...

సర్కారీ పట్టానా అనేది లేకుండా.. చెరువులన్నీ ప్రజల సొత్తని రంగనాథ్అన్నారు. నీరు తగ్గినప్పుడు చెరువుల చెంత వ్యవసాం చేసుకోడానికే అనుమతులున్నాయని.. చెరువు స్వరూపాన్ని మార్చడానికి వీలు లేదని స్పష్టం చేశారు. అక్కడ నిర్మాణాలు చేపడతామంటే కుదరదన్నారు. కొన్ని చోట్ల గేటెడ్ కమ్యూనిటీలు చెరువుకు వెళ్లే అవకాశం లేకుండా చేస్తున్నాయనే ఫిర్యాదులకు హైడ్రా కమిషనర్ ఈ వివరణ ఇచ్చారు. మొదటి విడతగా ఆరు చెరువులను పునరుద్ధరిస్తున్నామని.. ఇందులో ఇప్పటికే మూడింటిని ప్రారంభించామన్నారు. రెండో విడతగా 14 చెరువుల పునరుద్ధరణను చేపడుతున్నామని.. మరో 4 పెద్ద చెరువులను కూడా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. చెరువుల చెంత నివాసాలు కోల్పోయిన పేద వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని. నగరంలో వందల సంఖ్యలో ఉన్న చెరువులన్నిటినీ గుర్తించి సీఎస్ ఆర్ ఫండ్స్‌తో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని.. ఈదిశగా హైడ్రా చర్యలు తీసుకుంటోందన్నారు. హైడ్రా ఇప్పటి వరకూ 2093 ఎకరాలను స్వాధీనం చేసుకుందని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి 296.12 ఎకరాలు, నాలాల చెంత 24.05 ఎకరాలు, ప్రభుత్వ భూములు 1606.34 ఎకరాలు, పార్కుల ఆక్రమణలు తొలగించి 92.24 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. రహదారుల ఆక్రమణలు తొలగించి 49.28 ఎకరాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన 23.17 ఎకరాలు ఇందులో ఉన్నాయన్నారు. వీటి విలువ రూ. 85 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేశారు. వివిధ సందర్భాల్లో ఇప్పటివరకూ 90కి పైగా కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఇందుకు బాధ్యులపై చర్యలకు సంబంధిత శాఖలకు నివేదించామని తెలిపారు. ఈసమావేశంలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్,ఏసీపీలు తిరుమల్, ఉమామహేశ్వరరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో అభిషేక్‌శర్మ పూజలు

పూజలు నిర్వహిస్తున్న ఎస్ఆర్‌హెచ్ స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ

సైదాబాద్, మే 2 ప్రభాతవార్త: సన్ రైజర్స్ హైద్రాబాద్ (ఎస్ఆర్‌హెచ్) స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ శనివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి చేరుకున్న అభిషేక్ శర్మకు దేవాలయ పాలక మండలి ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, కార్యనిర్వాహణాధికారి లావణ్య, సిబ్బంది, పాలక మండలి సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామి వారికి అభిషేక్ శర్మ అభిషేకం జరిపించారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ పర్యటనకు సంబంధించిన ఫోటోలను అభిషేక్ శర్మ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేయగా, కొద్ది సేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అభిషేక్ శర్మ అభిమానులు పెద్ద సంఖ్యలో లైక్స్, కామెంట్లతో స్పందిస్తున్నారు. కాగా సన్‌రైజర్స్ హైద్రాబాద్ ప్లేయర్స్ కొందరు గత నెలలో బల్కంపేట ఎల్లమ్మతల్లి, పెద్దమ్మ తల్లి దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. రేపు కెకెఆర్ తో ఎస్ఆర్‌హెచ్ తలపడనుంది.

పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం

-వాణిజ్య సంస్థల్లో డస్ట్‌బిన్ లేకుంటే ట్రేడ్ లైసెన్స్ రద్దు
-ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు "ప్రతి రోజు ఒకవార్డు "
-ప్రజావాణి ఫిర్యాదులకు 24గంటల్లో పరిష్కారానికి చర్యలు
-మీడియా చిట్‌చాట్‌లో సిఎంసి కమిషనర్ సృజన

హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త: వ్యాపార కేంద్రాలు, మాల్స్, హోటళ్లు, రెస్టారెంట్ల దగ్గర తప్పనిసరిగా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని లేకుంటే బిజినెస్ బంద్ చేసి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్(సీఎంసీ) జి.సృజన స్పష్టం అన్నారు. ఈమేరకు శనివారం మాదాపూర్ లోని న్యాక్ బిల్డింగ్స్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణను అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వాణిజ్య సంస్థలకు బిన్ ఏర్పాటు చేయాలని ముందుగా చెబుతామని, ఆతర్వాతనే చర్యలు ఉంటాయన్నారు. సిఎంసి పరిధిలోని 16 సర్కిళ్లను ఒక్కోదాన్ని మూడు సార్లు విజిట్ చేశామని, ఇక నుంచి ప్రతి వార్డును తనిఖీ చేయడంతోపాటు కొత్త సమస్యలను గుర్తించడం, గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిఎంసిలో ప్రతివిభాగానికి సిస్టం ఆఫ్ ప్రొసిజర్(ఎస్ఓపీ) రూపొందించామని తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్, ప్రజలకు అందించాల్సిన సేవలు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, స్పోర్ట్స్, రెవెన్యూ, శానిటేషన్, ఎంటమాలజీ వంటి కార్యక్రమాలను చేపట్టడానికి వ్యవస్థాగతమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే హెడ్ ఆఫీసు భవనాన్ని హైటెక్ సిటీ, మాదాపూర్ పరిసరాల్లో నిర్మించడానికి కసరత్తు చేస్తున్నామని ఇప్పటికే కైతలాపూర్ లో రెండు హౌసింగ్ బోర్డు భూములను పరిశీలించామన్నారు. కోర్టు కేసుల కారణంగా వేరే ప్రాంతాల్లో స్థలాల కోసం అన్వేషిస్తున్నామని తెలిపారు. అలాగే పౌర ఫిర్యాదులపై ఫోకస్ పెట్టామని, ఎక్స్, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపు, ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి 24గంటల్లో సిటిజన్‌కు సదరు ఆఫీసర్ కాల్ చేయాల్సిందేనని, 48గంటల్లో ఫిర్యాదుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక ప్రజావాణిలో అందిన ఫిర్యాదును వచ్చే ప్రజావాణి నాటికి పరిష్కరించాల్సిందేనని, పరిష్కారం కాకపోతే ఎందుకు పెండింగ్ లో పెట్టారో రశీదులో పొందుపర్చాలని అధికారులకు ఆదేశాలిస్తున్నట్టు స్పష్టం చేశారు. అలాగే మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో సిబ్బంది కొరత ఉందని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇద్దరు ఏసీపీలు సీఎంసీతోపాటు వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లోనూ విధులు నిర్వహిస్తున్నారని, ఇలాంటి వాళ్లతో క్వాలిటీ వర్క్ తీసుకోవడం సాధ్యంకాదని చెప్పారు. డీటీసీపీ, పబ్లిక్ విభాగం, సీడీఎంఏ, పంచాయతీరాజ్ శాఖల నుంచి డిప్యూటేషన్ పై పంపించాలని కోరినట్టు చెప్పారు.

ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలో రెండు రకాల విధానాలు..

ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలో రెండు రకాల విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పాత జీహెచ్‌ఎంసీ పరిధిలో రెంటల్ వ్యాల్యూ, విలీన మున్సిపాలిటీల్లో కాపిటల్ వ్యాల్యూ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేస్తున్నామని, ఇది సరైందికాదని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే రెంటల్ వ్యాల్యూ కంటే కాపిటల్ వ్యాల్యూ ఆధారంగా ఉంటేనే బెటరని చెప్పారు. రెంటల్ వ్యాల్యూ ఆధారంగా అయితే పేదలకు అన్యాయం జరుగుతుందని, కాపిటల్ వ్యాల్యూ అయితే శాస్త్రీయబద్దంగా ఉంటుందన్నారు. పెండింగ్ బిల్స్ రూ.150కోట్లు, ఒక జోన్ లో రూ.110కోట్లు, మరో జోన్ లో రూ.80కోట్లు, ఇంకో జోన్ లో రూ.90కోట్ల మొత్తం రూ.430కోట్లు అవసరముందన్నారు. అలాగే హెచ్‌సిటీ ప్రాజెక్టుల కోసం రూ.2,500కోట్లు అవసరముందని, నిధుల కోసం ప్రభుత్వాన్ని అడుగుతామని చెప్పారు. అలాగే సీఎంసీ పరిధిలోని అన్ని రకాల అసెట్స్ గుర్తించామని . షాప్స్ 428, స్పోర్ట్స్ కాంప్లెక్స్ 24, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్ 21, కమ్యూనిటీ హాల్స్ 357, 1590 ఓపెన్ స్పేసెస్, 21ప్లైఓవర్లు ఉన్నాయని తెలిపారు. 21ప్లైఓవర్లను స్పోర్ట్స్ ఫెసిలిటీ సెంటర్లుగాను, ఈటింగ్ ఫెసిలిటీ సెంటర్లుగాను మారుస్తామని తెలిపారు. ఓపెన్ స్పేసెస్ లో 50శాతం పార్కులు, 50శాతం పార్కుల అభివృద్ధి చేస్తామని చెప్పారు. అలాగే ప్రయివేటు, పబ్లిక్ పార్ట్‌నర్ షిప్ విధానంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ లను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాలసీలన్నీ ఒకే విధానం..

కొత్త అడ్వర్ టైజ్ మెంట్ పాలసీ అమలు, సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణ, స్ట్రీట్ లైట్ల నిర్వహణ అంశాలను క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో కామన్ విధానం ఉంటుందని మూడింటికి కామన్ టెండర్ డాక్యుమెంట్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అడ్వర్ టైజ్ మెంట్ కు సంబంధించిన అన్ని రకాల డేటా సేకరించామని వీటిలో ఆర్ అండ్ బీ, నేషనల్ హై, రైల్వే శాఖలు 2030 వరకు కూడా లీజు ఇచ్చిన పరిస్థితి ఉందని, వీటిని ఎలా పర్యవేక్షించాలనేదానిపై న్యాయనిపుణులు సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు.

సంజీవరెడ్డి నగర్ కేఎల్ఎన్ పార్క్ సమస్యలపై ఎమ్మెల్యే తలసాని దృష్టి

పార్కులో తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్, మే 2, ప్రభాతవార్త: ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కుల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన సనత్ నగర్ పరిధిలోని కేఎల్ఎన్ పార్క్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు.పార్క్ అంతా తిరుగుతూ స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పార్క్‌లోని కొలనులోకి మురుగునీరు చేరి దుర్వాసన వస్తోందని గుర్తించి, మురుగునీటి మూలాన్ని గుర్తించి తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా, వేసవి కాలంలో మొక్కలకు నీటి కొరత ఏర్పడడంతో అవి ఎండిపోతున్నాయని పార్క్ ప్రతినిధులు చెప్పగా, నీటి సరఫరా మెరుగుపర్చాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. బోర్ మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.పార్క్‌లో టాయిలెట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని, సులభ్ కాంప్లెక్స్ ద్వారా నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓపెన్ జిమ్ పరికరాలు దెబ్బతినడంతో వాటి మరమ్మతులు చేపట్టాలని, పిల్లల ఆటపాట పరికరాలను కూడా సరిచేయడం లేదా కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు.అలాగే, చెట్ల కొమ్మలు పడి జిమ్ చేసే వారికి ప్రమాదం కలుగుతున్నందున వెంటనే తొలగించాలని హార్టికల్చర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్క్‌లో అవసరమైన అన్ని అభివృద్ధి, మరమ్మతు పనులను గుర్తించి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ పార్క్‌ను అభివృద్ధి చేశామని, యోగా సాధకుల కోసం షెడ్డు, వాకర్స్ కోసం పాత్‌వేలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వారం రోజుల్లో పార్క్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆమీ ర్‌పేట్ సర్కిల్ డీసీ సుజాత, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ మహేష్, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, ఎలెక్ట్రికల్ ఏఈ శేఖర్, సనత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, శేఖర్, గోపీలాల్ చౌహాన్, పురుషోత్తం, వాకర్స్ అసోసియేషన్ ఛైర్మన్ షాబాద్ శ్రీనివాస్, అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ గౌడ్, గోపాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

చాంద్రాయణగుట్ట, మే 2, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం నియోజక వర్గ స్థాయి సమావేశం హఫీజ్ బాబానగర్‌లోని కోహినూర్ ఫంక్షన్ హాలు లో జరిగింది. హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యఅతిథిగా హాజరై గత రెండున్నర సంవత్సరాల కాలంగా రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. 42 చౌకధరల దుకాణాల ద్వారా 33, 568 కొత్త రేషన్‌కార్డులు, 22,819 కనెక్షన్లకు ఉచిత విద్యుత్, రూ.500 సబ్సిడి గ్యాస్ 30,312 మంది లబ్ధిదారులకు, షాదిముబారక్ -6,801, కళ్యాణలక్ష్మి -656 మందికి, ఉచిత బస్సు ప్రయాణం, ఆసరా పింఛన్లు -29,721, చాంద్రాయణగుట్ట సర్కిల్లో (23) - రూ.739 కోట్లతో రోడ్ల విస్తరణ, మరమ్మతులు, రూ.19.24 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు, రూ.39.17 కోట్లతో నిర్వాహణ పనులు, రూ.247 కోట్లతో పూడికతీత, రూ.5 కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మజ్లిస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పాషా, స్పెషల్ ఆఫీసర్ సురేందర్, నియోజక వర్గ ఆఫీసర్లు ప్రవీణ్ కుమార్, సురేందర్, రాజు, మాజీ కార్పొరేటర్లు తదితరులు హాజరైయ్యారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త : త్యాగరాయ గానసభ వేదికగా శనివారం సాయంత్రం భారత కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఖికళా సమర్పణ 2026 సాంస్కృతిక కార్యక్రమం నయనమనోహరంగా సాగింది. ప్రముఖ కూచిపూడి నృత్య గురువు వీణా గణేష్ అయ్యర్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్య రూపకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో భాగంగా నరసింహ వైభవం అంశంపై శిష్యులు అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చారు. అంతకుముందు భజ మానస, గణేశ శ్లోకాలు, వేంక టాచల నిలయం, అష్టలక్ష్మి స్తోత్రం వంటి కీర్తనలకు కళాకారులు అభినయించిన తీరు ఆకట్టుకుంది. రామాయణ శబ్దం, అడివో అల్లదివో, శృంగార లహరి, క్షేత్రజ్ఞ పదం మరియు జావళి వంటి ప్రదర్శనలు భారతీయ శాస్త్రీయ నృత్య గొప్పతనాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ విరించి శర్మ, గడిల అంజనేయులు హాజరై కళాకారులను అభినందించారు. అంకం శిరీష, శ్రీదేవి అరుణ్ కుమార్లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగిస్తూ యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. గురువు వీణా గణేష్ అయ్యర్ శిక్షణలో కళాకారులు ప్రదర్శించిన నృత్య రీతులు ఎంతో క్రమశిక్షణతో, కళాత్మకంగా ఉన్నాయని ప్రశంసించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన కళాభిమానులతో త్యాగరాయ గానసభ కిక్కిరిసిపోయింది.

జెకే కాలనీ హత్య మిస్టరీ ఛేదించిన నేరేడ్‌మెట్ పోలీసులు

-వంటగది కింద మృతదేహం దాచిన నిందితుడు అరెస్ట్

నేరేడ్‌మెట్ , మే 2, ప్రభాతవార్త : నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెకే కాలనీలో సంచలనం సృష్టించిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వంటగది ప్లాట్‌ఫామ్ కింద మృతదేహన్ని దాచిన ఘటనలో నిందితుడు గవ్వల మల్లేష్ (47)ను అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేష్ వృత్తిరీత్యా ప్లంబర్‌గా పనిచేస్తూ కుటుంబానికి వేరుగా అద్దె ఇంటిలో నివసి స్తున్నాడు. మృతుడు కంచి వెంకట్ రాములు (47) కూలీ పనులు చేసేవాడు. ఇద్దరికీ లేబర్ అడ్డాలలో పరిచయం ఏర్పడి, తరచూ కలిసి మద్యం సేవించేవారు.గత ఏడాది డిసెంబర్ 15న హెచ్‌బీ కాలనీ వద్ద పని దొరకకపోవడంతో మద్యం సేవించిన ఇద్దరూ మల్లేష్ ఇంటికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించే సమయంలో వ్యక్తిగత విషయాలపై వాగ్వాదం చెలరేగింది. అవమానకరంగా మాట్లాడటంతో ఆగ్రహించిన మల్లేష్ కర్రతో వెంకట్ రాములుపై దాడి చేసి హత్య చేశాడు.హత్య అనంతరం మృతదేహన్ని తాడుతో కట్టేసి వంటగది ప్లాట్‌ఫామ్ కింద దాచాడు. అనంతరం ఇటుకలతో గోడ కట్టి మూసివేసి అక్కడి నుంచి పరారయ్యాడు. కొన్ని నెలల తర్వాత ఇంటి యజమానికి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి తాళాలు పగులగొట్టి చూడగా, పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం బయటపడింది. దీంతో ఏప్రిల్ 17న కేసు వెలుగులోకి వచ్చింది.టెక్నికల్ ఆధారాలు, సమాచారం ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు మల్లేష్‌ను మే 1న జూబ్లీ బస్ స్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసును డీసీపీ శ్రీధర్, ఏసీపీ యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో నేరేడ్మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ బృందం ఛేదించింది. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ నంబర్ ప్లేట్ వాడుతున్న నిందితుడి అరెస్టు

సైదాబాద్, మే 2 ప్రభాతవార్త: ద్విచక్ర వాహనానికి నకిలీ నంబర్ ప్లేట్ వాడుతున్న నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చంచల్‌గూడ ఖాన్‌బాగ్‌కు చెందిన సయ్యద్ హుస్సేన్ మెహదీ అలియాస్ ఇజాన్(22) హీరో డియో ద్విచక్రవాహనాన్ని 2019లో కొనుగోలు చేశాడు. అయితే ఇప్పటి వరకు వాహనాన్ని ఆర్‌టిఓ కార్యాలయంలో రిజిస్టర్ చేయించలేదు. ట్రాఫిక్ చలాన్ల నుండి తప్పించుకోవడానికి, ఫైనాన్స్ ఏజెన్సీలను మోసం చేసే ఉద్దేశంతో ఇతర వాహనదారుడి నంబర్‌ను తన వాహనానికి నంబర్ ప్లేట్‌గా తగిలించాడు. దీంతో ఆ నంబరు ఉన్న అసలైన వాహన యజమాని వాహనంపై తప్పుడు చలాన్లు నమోదయ్యాయి. నిందితుడు హుస్సేన్ మెహదీని అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

-ఆక్రమణలు ఉపేక్షించేది లేదు
: తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ స్థలంలో వెలసిన షెడ్లు

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న జీపీవో సందీప్

దుండిగల్, మే 2 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ దుండిగల్ మండలం పరిధిలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు మండల రెవిన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలుచోట్ల ప్రభుత్వ స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 120/11లోని ప్రభుత్వ స్థలంలో శనివారం తహసీల్దార్ ఆదేశాల మేరకు జీపీవో సందీప్ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే..దొమ్మరపోచంపల్లి సర్వే నంబర్ 120/11లో 3 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో వసతి గృహాల కోసం ట్రైబల్ వెల్ఫేర్‌కు 02.25 ఎకరాలు కేటాయించారు. మిగతా 15 గుంటల స్థలంపై స్థానికంగా ఉన్న కొందరూ పాత దస్తావేజులను అడ్డం పెట్టుకొని కబ్జాలకు యత్నిస్తున్నారు. గండిమైసమ్మ-మేడ్చల్ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈస్థలం గజం రూ,50వేలకు పైగా పలుకుతుండడంతో ఏలాగైనా స్థలం కాజేయాలనే దురుద్దేశ్యంతో పక్కన ఉన్న సర్వేనంబర్ 127 పట్టా స్థలం పేరుతో పలు షెడ్లను నిర్మించి చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. గతంలో ప్లాట్లుగా చేయడంతో మేము కొనుగోలు చేశాం సహకరించండి అంటూ పలువురు దస్తావేజులతో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో ప్లాటుకు రూ,15లక్షలు ముట్టజెప్పితే సహకరించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలపడంతో అంగీకరించిన పలువురు ఇప్పటికే సుమారు రూ,60లక్షలకు పైగా ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా పట్టా స్థలం పేరుతో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు, వసూళ్ళ పర్వంపై ఉన్నతాధికారులతో పాటు మండల తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఆయన తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో సర్వే చేసిన సిబ్బంది సదరు స్థలం 120/11 ప్రభుత్వ స్థలంగా నివేదిక అందజేయడంతో వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేయడంతో జీపీవో సందీప్ శనివారం సిబ్బందితో కలిసి ప్రభుత్వ స్థలం అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఆక్రమణలు ఉపేక్షించేది లేదు

: తహసీల్దార్ ఎన్.రాజేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ ఎన్.రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 127 పట్టా స్థలం అని పేర్కొంటూ 120/11 ప్రభుత్వ స్థలంలో చేపట్టిన ఆక్రమణలపై తమకు ఫిర్యాదులు అందాయి. దీంతో మా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టా స్థలంలో కాకుండా 120/11 ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి నివేదిక అందజేశారు. దీంతో సదరు ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాము. నిబంధనలకు ప్రకారం ఆక్రమణలపై త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు పాల్పడిన, నిర్మాణాలు చేపట్టినా కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చలివేంద్రాలు బాట సారుల దప్పిక తీరుస్తాయి : ఎమ్మెల్యే తలసాని

చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న తలసాని, అరుణాగౌడ్.

బేగంపేట మే 2,ప్రభాతవార్త

వేసవి కాలంలో ఏర్పాటు చేసే చలి వేంద్రాలు బాటసారుల దప్పిక తీరుస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట డివిజన్ లోని రాణిగంజ్ లో బీఎంఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాణిగంజ్ మార్కెట్ కు ప్రతి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది ప్రజలు వస్తుంటారని, వారి దప్పిక తీర్చేలా ఇక్కడ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని ఎమ్మెల్యే అభినందించారు. బీఎంఎస్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించడాన్ని తలసాని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, అత్తెల్లి అరుణాగౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, బీఎంఎస్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, కుమార్, మహేష్ గౌడ్, జహంగీర్, మల్లేష్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాదెండ్లకు ఘన నివాళులు



నాదేండ్ల భాస్కర్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, చిత్రంలో ఆర్.లక్ష్మణ్‌యాదవ్, తొలుపునూరి కృష్ణగౌడ్, నారాయణస్వామి, ఎస్.హరినాథ్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నాదేండ్ల భాస్కర్‌రావుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావు ఘనంగా నివాళులర్పించారు. శనివారం జూబ్లీహిల్స్‌లో జరిగిన ఆయన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా భాస్కర్‌రావు కుమారుడు, ఏపీ మంత్రి నాదేండ్ల మనోహర్ తదితర కుటుంబ సభ్యులను ఆయన కలిసి మనోధైర్యం కల్పించారు. భాస్కర్‌రావుతో తనకున్న పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, దిలిప్‌కుమార్ తదితరులు నాదెండ్ల భాస్కర్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల సాధికారతతోనే నాణ్యమైన విద్య

ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్

కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్

చిక్కడపల్లి మే 2 ప్రభాతవార్త : ఉపాధ్యాయుల సాధికారతతోనే నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విద్యాసంస్థలు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగిసింది. ఫ్యాకల్టీ ఎంగేజ్‌మెంట్ విత్ స్టూడెంట్స్ ఫర్ అవుట్‌కమ్ బేస్డ్ అండ్ ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్" అనే అంశంపై అధ్యాపకులకు ఈ శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత విద్య అంతా ఫలితాధారిత అభ్యాసం పైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. బోధన, పరిశోధన, మూల్యాంకన ప్రక్రియలను సమాజ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆయన సూచించారు. 2020లో భాగంగా బహుళవిషయ విద్య ప్రాముఖ్యతను ప్రొఫెసర్ రాములు వివరించారు. ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ విద్యార్థుల సాధికారత గురించి ప్రసంగించగా, ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస మూర్తి భారతీయ సంస్కృతి, విలువల ప్రాముఖ్యతను గుర్తుచేశారు. డా. కె. ఉషారాణి స్మార్ట్ టూల్స్ వినియోగంపై సెషన్ నిర్వహించారు. కళాశాల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపాల్ డా. మట్టా శేఖర్, నోడల్ ఆఫీసర్ డా. జి. కృష్ణ శర్మల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు చివరగా సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ గీతాలాపనతో ఈ ఐదు రోజుల సదస్సు ముగిసింది.

కార్మికులను గౌరవిస్తేనే దేశాభివృద్ధి : బక్కని నర్సింహులు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, టీఎన్టీయూసీ మాజీ అధ్యక్షుడు ఎం కె.బోస్

చిక్కడపల్లి మే 2 (ప్రభాతవార్త) :

కష్టపడేవారిని గౌరవించే విధానం పెరిగినప్పుడే దేశం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు. శనివారం టీఎన్టీయూసీ మాజీ అధ్యక్షుడు ఎం కె.బోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చారిత్రక సంస్కరణలలో భాగంగా ఎన్టీఆర్ పటేల్‌పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం వల్లే తెలంగాణలో వెట్టిచాకిరీ అంతమైందని, శ్రమ శక్తి అవార్డులతో శ్రమకు గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. టీఎన్టీయూసీ మాజీ అధ్యక్షుడు ఎం కె.బోస్ మాట్లాడుతూ శ్రమశక్తి అవార్డుల పంపిణీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వలె ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పక్షపాతంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు బంటు వెంకటేశ్వర్లు, అజ్మీరా రాజునాయక్, శ్రీపతి సతీష్, పోలంపల్లి అశోక్, కసిరెడ్డి శేఖర్ రెడ్డి, వేజెండ్ల కిశోర్ బాబు, మందవ వెంకటేష్ గౌడ్ మరియు టీఎన్టీయూసీ నాయకులు ఎబిఆర్ మోహన్రావు, జగదీష్, కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సారస్వత పరిషత్తు పురస్కారం

నాంపల్లి, మే 2 ప్రభాతవార్త : సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి, ప్రముఖ న్యాయకోవిదుడు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి డా. ఎం. శ్రీధర్‌రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారం ప్రదానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్ణయించినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య పేర్కొన్నారు. సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదిక 5 మంగళవారం ఉదయం 10.30లకు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తారని వివరించారు. పురస్కారం కింద 25వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించనున్నట్లు చెన్నయ్య వెల్లడిం చారు. తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు డా. శ్రీధర్‌రెడ్డి పేరుతో ఆయన భార్య డా. విజయలక్ష్మి పరిషత్తులో నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

5న ధర్నాచౌక్ వద్ద ఆటో, ప్రైవేటు రవాణా కార్మికుల ధర్నా

మహాధర్నా కు సంబంధించి కరపత్రాన్ని విడుదల చేస్తున్న సంఘ్ ప్రధాన కార్యదర్శి రవి శంకర్, చిత్రంలో ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్య గౌడ్ , మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి

చిక్కడపల్లి మే 2 ,ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని ఆటో మరియు ప్రైవేటు రవాణా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బి ఎం ఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి వివరాలు వెల్లడించి ధర్నాకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోయి డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోలీస్, ఆర్టీఓ చలానాల మోత పెరిగిందని, దీనికి తోడు ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి సంస్థల అక్రమ బైక్ టాక్సీల వల్ల ఆటో డ్రైవర్ల ఆదాయం దెబ్బతింటోందని మండిపడ్డారు. తెలంగాణ స్టేట్ ఆటో టాక్సీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు నంద కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రవాణా కార్మికుల కోసం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గూడ్స్ వాహనాలు, అంబులెన్సులకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్య గౌడ్ , మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి విమర్శించారు. రవాణా శాఖ భూములను కాపాడలేని ప్రభుత్వం, సామాన్య డ్రైవర్ల వద్ద మాత్రం ముక్కుపిండి చలానాలు వసూలు చేయడం సమంజసం కాదన్నారు.

విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది తప్పకుండా భద్రతా సూత్రాలు పాటించాలి

-మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి

విద్యుత్ సిబ్బందికి భద్రత పరికరాలు పంపిణీ చేస్తున్న టిజిఎస్‌పిటిసిఎల్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి

చార్మినార్,మే 2 ప్రభాతవార్త : విధి నిర్వాహణలో విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది తప్పకుండ భద్రత పరికరాలను ధరించాలని,భద్రత సూత్రాలను పాటించట వల్ల ప్రమాదాలు జరగవని టిజిఎస్‌సిటిసిఎల్ మెట్రోజోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలో శనివారం ఫంజేషాలోని చార్మినార్ ఏడిఈ విద్యుత్ కార్యాలయంలో జరిగిన భద్రత వారోత్సవాల కార్యక్రమానికి మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి ముఖ్య అతిధిగా విచ్చేశారు. చార్మినార్, మొగల్‌పుర, హుస్సేనీఆలంవిద్యుత్ సెక్షన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు,సిబ్బందికి ఆయన భద్రత పరికరాలు హెల్మెట్లు,ఎర్త్ రాడ్లు,సెప్టీ బెల్ట్,హ్యాండ్ గ్లౌజులు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది తప్పకుండ భద్రత సూత్రాలను పాటించాలని కోరారు.సిబ్బంది వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించి సంస్థకు మంచి పేరు తీసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిజిఎస్‌పిటిసిఎల్ సౌత్ సర్కిల్ ఎస్ఈ టి.శ్రీనివాస్,చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,చార్మినార్ ఏడిఈ సయ్యద్ మక్సూద్,చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్,ఫలక్‌నుమా సిబిడి ఏడిఈ రాజేందర్‌సింగ్, చార్మినర్ ఏఈ మహ్మద్ అబ్దుల్ నసీర్,హుస్సేనీఆలం ఏఈ రాములు,చార్మినార్ సబ్ ఇంజనీరు సంతోష్‌తో పాటు విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

చార్మినార్,మే 2 ప్రభాతవార్త : ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు లబ్ది చేకూరేలా పాతబస్తీలో మజ్లిస్ కృషి చేస్తున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం శాసన సభ్యులు మహ్మద్ ముబీన్ అన్నారు.బహదూర్‌పురలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బహదూర్‌పుర నియోజకవర్గం స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ వివిధ శాఖల సమన్వయంతో పలు అభివృద్ది కార్యక్రమాలు జరిగాయని,నియోజకవర్గంలోని పేద ప్రజలకు రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు.ప్రజలు సంక్షేమ పథకాలను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.నియోజకవర్గంలోని మహిళా గ్రూపులకు ఆయన 88 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో బహదూర్‌పుర మండలం తహసీల్దార్ బాల శంకర్,బహదూరపుర నోడల్ అధికారి కోటాజీ, ఏఎస్ఓ అస్లాంఖాన్,ఎంఐఎం కార్పొరేటర్లు హుస్సేనీపా షా, మహ్మద్ సలీం,ముజాఫర్ అలీ,మాజీ కార్పొరేటర్ ఎంఎ గఫార్‌తో పాటు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

5 నుంచి సైకాలజిస్ట్స్ అసోసియేషన్ దశాబ్ధి ఉత్సవాలు

సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త:

దశాబ్దకాలం పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలను అందించిన 'తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ దశాబ్ధి ఉత్సవాలు' ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. ఈ పదేళ్ళ కాలంలో మానసిక ఆరోగ్య రంగంలో చేసిన సేవలను మననం చేసుకుంటూ వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో కేకులు కటింగ్‌లు, 6, హ్యాపి హోమ్స్ పేరిట ఎంపిక చేసిన అపార్ట్‌మెంట్‌లలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు, 7న ఫోటో ఎగ్జిబిషన్, 9న హోటల్ కత్రియలో మానసిక ఆరోగ్య రంగంలో దశాబ్దపు ప్రగతిపై చర్చ, 10న ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో దశాబ్ధి ఉత్సవాల పురస్కారాల వేడుకలు, 12, 13న తెలంగాణ వెల్‌నెస్ వాక్, 15న ఉచిత వెబ్‌నార్ల శ్రేణి: యువత ప్రవర్తనా సమస్యలపై రాష్ట్ర స్థాయిలో ఉచితం అన్‌లైన్ అవగాహన సదస్సులు, ముగింపు కార్యక్రమం జరుగుతుందని ఆయన వివరించారు.

వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలందిస్తున్నాం

: నిలోఫర్ సూపరింటెండెంట్ ఆచార్య విజయకుమార్



జెండా ఆవిష్కరించి విజయకుమార్, లాలూప్రసాద్, వినోద్‌కుమార్, ఆనంద్, నాగజ్యోతి, సత్యం, భూమయ్య తదితర అతిథులు

నాంపల్లి, మే 2 ప్రభాతవార్త :

ఆస్పత్రికి వచ్చిన వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆస్పత్రికి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆచార్య విజయకుమార్ సూచించారు. రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తున్న నిలోఫర్‌లో నానాటికీ పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఆధునాతన చికిత్స, వసతులు, వైద్య పరికరాలు, అత్యున్నతస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయకుమార్ తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యదర్శి డా. లాలూప్రసాద్ రాథోడ్, ఆచార్య వినోద్‌కుమార్, వైద్యులు ఆనంద్, నాగజ్యోతి, ఏఐటియుసీ బ్రాంచ్ అధ్యక్షుడు సుందర్, ఉపాధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి భూమయ్య, యాదన్న, నాయకులు సంజీవ్ చారి, సత్యనారాయణగౌడ్ తదితరులతో కలిసి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముందుగా కార్మికులు, ఉద్యోగులకు మే డే శుభాకాంక్షలు తెలుపుతూ ఆస్పత్రి సిబ్బంది 24గంటలపాటూ రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్నారని, ఇకముందూ అదే సేవాభావంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

అత్తాపూర్ మే2 ,ప్రభాతవార్త : హిందూ సమ్మేళనానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం శివరాంపల్లి శిశు మందిర్ పాఠశాలలో రాబోయే హిందూ మహా సమ్మేళనానికి సంబంధించిన ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మ పరిరక్షణతో పాటు సమాజంలోని అన్ని వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఐక్యత, సాంస్కృతిక విలువలు మరియు సామాజిక బాధ్యతల ప్రాముఖ్యతను స్పష్టంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమం పూర్తిగా సామాజిక సమరసత మరియు సమాజ శ్రేయస్సు కోసమే నిర్వహించబడుతోందని, దీనికి ఎలాంటి రాజకీయ సంబంధం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. సమావేశం ముగింపులో"ధర్మమే మన శ్వాస – ఐక్యతే మన బలం" అనే సందేశంతో పాటు యువత ముందుకు వచ్చి సమ్మేళనంలో చురుకుగా పాల్గొని సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. చంద్రరెడ్డి, కమిటీ సభ్యులు మరియు శివరాంపల్లి పెద్దలు పాల్గొన్నారు. విడుదల చేసినవారు

విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



అత్తాపూర్ మే2 ,ప్రభాతవార్త : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంచిగా చదవి ఉన్నత శిఖరాలకు ఎదిగాలని నియోజకవర్గంలో విద్య అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రాజేంద్ర నగర్ మండలంలోని అత్యధిక మార్కులు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహేష్ 548, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని రూపశ్రీ 508 , అలాగే ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని చాందిని 518లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా సన్మానించి ప్రశంసించారు.ఈ సందర్బంగా విద్యార్థులను మీరు భవిష్యత్తులో బాగా కష్టపడి చదివి మరింత ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పి ఆర్ టి యు రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస సాగర్, పి ఆర్ టి యు స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు సాయి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మంగ్లీపై పథకం ప్రకారమే కుట్ర : మోతీలాల్ నాయక్

-సిబిసిఐడిచే విచారణ జరిపించాలని సిఎంకు విజ్ఞప్తి

సమావేశంలో మాట్లాడుతున్న మోతీలాల్‌నాయక్

సైఫాబాద్, మే 2 ప్రభాతవార్త: ప్రముఖ గాయని, గిరిజన బిడ్డ మంగ్లీ ఎదుగుదలని చూసిన కొందరు ఓర్వలేక కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ ఆమెను అభాసుపాలు చేస్తున్నారని సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ ఆరోపించారు. ఒక పథకం ప్రకారం కుట్ర పూరితంగా ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, ఛానల్స్ పనిగట్టుకుని వ్యూస్ కోసం మంగ్లీపై ఇష్టారీతిలో అసభ్యకరంగా గ్లోబల్ ప్రచారం చేస్తూ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు పోలీస్ దర్యాప్తులో ఉందని, మంగ్లీ తప్పు చేస్తే పోలీసులు ఎక్కడికి రమ్మంటే అక్కడకు రావడానికి మంగ్లీ సిద్ధంగా ఉందన్నారు. అన్యాయంగా మంగ్లీ జోలికి వస్తే సహించేది లేదని, ఆమెకు రెండు తెలుగు రాష్ట్రాలలో బంజారాలు అండగా ఉన్నారని, ఆమెను ఎవరైనా దూషిస్తే నాలుక కోస్తామని హెచ్చరించారు. మైక్రో ఫైనాన్స్ విషయంలో నిజా నిజాలు నిగ్గు తెల్చడానికి సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డిజిపి చొరవ తీసుకుని ఈ కేసును సిబిసిఐడిచే విచారణ జరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు రవీందర్‌నాయక్, ధరావత్ గణేష్‌నాయక్, అభిషేక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో కొట్టి అత్తను చంపిన అల్లుడు.

హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త

భార్య మీద కోపంతో ఓ వ్యక్తి అత్తను చంపేశాడు. బైక్‌పై వెళ్తుండగా హెల్మెట్‌తో తలపై కొట్టడంతో కిందపడి తీవ్రగాయాలై అత్త మరణించింది. ఆ తర్వాత ఏమీ తెలియనట్లుగా ఫిట్స్ వచ్చి కిందపడటంతోనే ఈ ప్రమాదం జరిగిందని అందర్నీ నమ్మించే ప్రయత్నం చేశాడు. కానీ భార్యకు అనుమానం వచ్చి అక్కడి సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ఆర్టీసీ కాలనీకి చెందిన కొల్ల అరుణ (39)కి ఇద్దరు కూతుళ్లు. చిన్న కుమార్తె కావ్య (19) గత ఏడాది కరీంనగర్ చందన్‌పూర్‌కు చెందిన కర్రు స్నేహిత్ (28)ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ కొద్దిరోజులుగా వారికి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే గత నెల 29వ తేదీన రాత్రి అరుణకు స్నేహిత్ ఫోన్ చేశాడు. 'నేను పెద్ద కంపెనీలో ఆఫీసర్‌ను. బాసాన్లు తోముకునే నీ కూతుర్ని పెళ్లి చేసుకున్నా.. కానీ నీ కూతురు చిన్న విషయాలకే అలుగుతుంది'అని కోప్పడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.ఆ మరుసటి రోజు మధ్యాహ్నం అరుణ దుకాణానికి వెళ్లి వస్తుండగా స్నేహిత్ ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొద్దిసేపటికే కావ్యకు కాల్ చేసి.. అత్తమ్మ ఫిట్స్‌తో బండిపై నుంచి కిందపడిపోయింది. బలమైన దెబ్బలు తగలడంతో ఆస్పత్రికి తరలించానని చెప్పాడు. భర్త మాటలతో కంగారు పడిన కావ్య వెంటనే ఆస్పత్రికి చేరుకుంది. అదే రోజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అరుణ మరణించింది.అయితే అసలు ఏమైందని స్నేహిత్‌ను నిలదీసినప్పుడు అతని ప్రవర్తనలో తేడా ఉండటాన్ని కావ్య గమనించింది. దీంతో ఘటన జరిగిన చెంగిచర్ల ఆర్టీసీ కాలనీలోని హనుమాన్ ఆలయ సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించింది. అందులో అరుణతో స్నేహిత్ గొడవపడి హెల్మెట్‌తో బలంగా కొట్టడం.ఆ దెబ్బకు బైక్‌పై నుంచి ఆమె కిందపడినట్లు స్పష్టంగా రికార్డయ్యింది. ఇదిలా ఉంటే దీంతో తన తల్లి మృతికి భర్తే కారణమని కావ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ హత్యకు సంబంధించిన సీసీ ఫుటేజ్ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

స్వీయగణనలో పాల్గొన్న న్యాయమూర్తులు

స్వీయగణనలో పాల్గొన్న జస్టిస్ నాగేష్ భీమపాక

జూబ్లీహిల్స్, మే 2, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్ సర్కిల్-36 పరిధిలోని న్యాయవిహార్‌లో పలువురు న్యాయమూర్తులు స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ నాగేష్ భీమపాక, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ ఎన్. తుకారాంజీ, జస్టిస్ కె. సృజన, జస్టిస్ కె. శరత్, జస్టిస్ చాడ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొని స్వీయ గణన పూర్తి చేశారు. ఈ సందర్బంగా న్యాయమూర్తులు స్వీయగణనకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మానవత్వానికి నిలువెత్తు రూపం దుద్దు సుబ్రహ్మణ్యం

దుద్దు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి మే 2 (ప్రభాతవార్త) : మానవత్వానికి నిలువెత్తు రూపం దుద్దు సుబ్రహ్మణ్యం అని ద్యుతి మ్యూజికల్ అకాడమీ అధినేత, ప్రముఖ సంఘసేవకుడు పేరి నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం సుబ్రహ్మణ్యం చేస్తున్న సేవలకు గుర్తింపుగా చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ , విజయ్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు పేరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎక్కడ మరణం సంభవించినా సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకొని, బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడమే కాకుండా, అంత్యక్రియల బాధ్యతను దగ్గరుండి పర్యవేక్షించడం విశేషమన్నారు.

అన్నమయ్య సంకీర్తనే సమాజానికి రక్ష

: తిరుపతి శ్రీశక్తి పీఠం శ్రీ రామానంద భారతి స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ రాధారాణి, శ్రీశక్తి పీఠం శ్రీ రామానంద భారతి స్వామి, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు తదితరులు

చిక్కడపల్లి మే 2 (ప్రభాతవార్త) :

అన్నమాచార్యుల సంకీర్తనలు కేవలం భక్తి మార్గానికే పరిమితం కాకుండా, సమాజ శ్రేయస్సుకు దిక్సూచిలా నిలుస్తాయని తిరుపతి శ్రీశక్తి పీఠం శ్రీ రామానంద భారతి స్వామి భక్తులకు దివ్య ఆశీస్సులు అందజేశారు. శనివారం అన్నమయ్య పదకోకిల, పద్మశ్రీ శోభారాజు ఆధ్వర్యంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యులు వారి 618వ జయంతి సందర్బంగా అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో అన్నమాచార్యుల విగ్రహం వద్ద విశ్వశాంతి సంకీర్తనాయజ్ఞం భక్తిభావంతో వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయం నుండి మహా నగరసంకీర్తన జరిగింది. విశిష్ట అతిధిగా హాజరైన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో శాంతిని పెంపొందించడానికి ఇటువంటి సంకీర్తనాయజ్ఞాలు ఎంతో అవసరమని అభివర్ణించారు. అన్నమయ్య సాహిత్యంలోని గొప్పతనాన్ని రాబోయే తరాలకు అందించడం అభినందనీయమన్నారు. చెన్నూరి సుబ్బారావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, మొక్కవోని దీక్షతో అన్నమాచార్య సంకీర్తనా ప్రచారాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏకైక వ్యక్తి శోభారాజు అని శ్లాఘించారు. తాడేపల్లి పతంజలి, కె. హనుమంతరావు, డాక్టర్ నందకుమార్, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి పేరిట మోసం...

-ఇద్దరు స్కూల్ డైరెక్టర్లు అరెస్ట్

జూబ్లీహిల్స్, మే 2, ప్రభాతవార్త: పెట్టుబడి పేరిట డబ్బులు తీసుకుని బోగస్ చెక్కులు ఇచ్చి మోసానికి పాల్పడిన ఇద్దరు స్కూల్ డైరెక్టర్లను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ ఎస్ఐ విజయ్ కొట్టూర్ కథనం ప్రకారం... కమలాపురికాలనీలో బడ్స్ అండ్ ఫ్లవర్స్ పాఠశాల ఉంది. చనుబోయిన గోవింద్, ఆయన భార్య చనుబోయిన శ్రీదేవి డైరెక్టర్లుగా, కలిగెట్ల లక్ష్మీ ప్రసన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా ఉన్నారు. తమ పాఠశాలను బ్రాంచీలుగా విస్తరిస్తున్నామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలిస్తామని గోవింద్, శ్రీదేవి చెప్పడంతో ఎస్ఎ స్ రెడ్డి అనే వ్యాపారి రూ.50 లక్షల పెట్టుబడి పెట్టాడు. లాభాల విషయమై వారు సమాధానం దాటవేస్తుండటంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు వారిని కోరాడు. దీంతో వారు గత నెల మొదటివారంలో ఆయనకు ఆరు చెక్కులు ఇచ్చారు. వాటిని బ్యాంక్ డిపాజిట్ చేయడానికి వెళ్లగా అవి బ్లాక్ అయిన బ్యాంక్ అకౌంట్ చెక్కులని తేలింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు గోవింద్, శ్రీదేవిలను కలవడానికి పలుమార్లు స్కూల్‌కు వెళ్లగా బౌన్సర్లతో అడ్డుకుని దాడులు చేయించారు. బంజారాహిల్స్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏటిఎంలో డబ్బులు దొంగిలించిన నిందితుల అరెస్ట్

నిందితులను పట్టుకున్న ముషీరాబాద్ పోలీసులు, ఏసీపీ రమేష్‌కుమార్

ముషీరాబాద్, మే 2, ప్రభాతవార్త: ఏటీఎం ద్వారా కస్టమర్ అకౌంట్ నుంచి డబ్బులు దొంగిలించిన ముగ్గురు నిందితులను ముషీరాబాద్ పోలీసులు సికింనరదాబాద్ జోన్ సిపి టాస్క్ ఫోర్స్ బృందంతో కలసి అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్‌కు చెందిన మహ్మద్ గుల్ఫామ్ (22), ముంబాయికి చెందిన మహ్మద్ రిజ్వాన్ (28), ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన అదిల్ అలీ (19)లు డ్రైవర్లుగా పనిచేస్తూ పలు కేసులలో నిందితులుగా ఉన్నారు. ఈ క్రమంలో గత నెల 23వ తేదీ ముషీరాబాద్ ఎస్‌బిఐ బ్రాంచ్ ఏటీఎంలో ఒక కస్టమర్ ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేశారు. కస్టమర్ బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకురావటంతో బ్రాంచ్ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ముషీరాబాద్ పోలీసులు, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సాయంతో, శనివారం రాజా డీలక్స్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగిలించిన నగదుతో పాటు, దొంగతనానికి ఉపయోగించిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విజయం అంకితభావాన్ని మరింత పెంచాలి

: కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే2 ప్రభాతవార్త

విద్యార్థులు అంకితభావంతో కష్టించి సాధించిన విజయం భవిషత్ పట్ల అంకితభావాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ సూచించారు. చింతల్ త్రివేణి హైస్కూల్ విద్యార్థులు ఇటీవల వెలువడిన పదవతరగతి ఫలితాలలో ఉత్తమమార్కులు సాధించిన సందర్బంగా వారిని అభినందించారు. త్రివేణి విద్యాసంస్థల ప్రతినిధులు సిఎస్ఓ సుబ్బారావు, సిఆర్ఓ వెంకట్‌రావు, చింతల్ బ్రాంచ్ ప్రిన్సిపల్ శివకీర్తన, అకాడమిక్ ఇంచార్జి చిన్నారావు, ఇంపాక్ట్ ఇంచార్జి వనిత, క్యాంపస్ ఇంచార్జి క్రాంతిల ఆధ్వర్యంలో చింతల్ బ్రాంచ్ విద్యార్థులు కలిసారు. ఈసందర్బంగా కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏదైనా సాధించగలమనే పట్టుదల, అంకితభావాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కాలకమన్నారు.

డిజిపిని కలిసిన కొత్త సంజీవరెడ్డి

డిజిపి సివి.ఆనంద్‌కు అభినందనలు తెలుపుతున్న ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి తదితరులు

కంటోన్మెంట్,మే 2 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర డిజిపిగా సి.వి.అనంద్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కంటోన్మెంట్ నియోజవర్గానికి చెందిన ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్తసంజీవరెడ్డి శనివారం సి.వి.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పూర్వం పీఎస్ పరిధిలో ఉన్న ప్రాంతాలను యధావిధిగా కొనసాగించాలని డిజిపి దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. అడ్డగుట్ట,తుకారాంగేట్ పరిసర ప్రాంతాలను లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో విలీనం చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు దూర నప్రాంతంలో ఉన్న లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిఫిర్యాదు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిజిపి దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. సి.వి.ఆనంద్‌ను కలిసి వారిలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క చెన్నారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరినాథ్‌రెడ్డి, పూజారి సాంబయ్యలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా సరి చేసుకోవాలి : లింగాని ప్రసన్న

అడ్డగుట్టలో నిర్వహించిన ఎస్.ఆర్.ఐ.కార్యక్రమంలో పాల్గొన్న మారేడ్‌పల్లి తహశీల్దార్ ఆసదుల్లాఖాన్,అడ్డగుట్ట మాజీ కార్పోరేటర్ లింగాని ప్రసన్న

అడ్డగుట్ట,మే 2 ప్రభాతవార్త: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్.ఆర్.ఐ) సర్వేకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని అడ్డగుట్ట డివిజన్ మాజీ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ సూచించారు. శనివారం అడ్డగుట్టలో నిర్వహించిన ఎస్.ఆర్.ఐ. సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. స్థానికంగా నివాసం ఉంటున్న ఓటర్ లిస్టు నుంచి ప్రజల పేర్లను తొలగించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ లిస్టు జాబితాలో తమ పేర్లు సక్రమంగా ఉండే విధంగా సరి చేసుకోవాలని ఆమె తెలిపారు.మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్,నక్క మధు, అయోధ్య, మోహన్, దేవయ్య,రామప్ప, మహేందర్, రాజు, భాగ్య, సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

- ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్



నర్కి పూల్‌బాగ్‌లోని జెడ్సి కార్యాలయంలో అభివృద్ధి పనులపై జెడ్సి సత్యనారాయణ, అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

చాంద్రాయణగుట్ట, మే 2, ప్రభాతవార్త : యాకుత్‌పురా నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ జీహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు. శనివారం నర్కి పూల్‌బాగ్‌లోని చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జెడ్సి కె.సత్యనారాయణ, యాకుత్‌పురా, మలక్‌పేట్ సర్కిళ్ళ డిసిలు సుభాష్‌రావు, భాస్కర్‌రెడ్డి, ఎస్ఇ ఇందిరా దేవి తదితర అధికారులతో సమావేశమై సమీక్షించారు. అపరిష్కృత సమస్యలపై చర్చించారు. సాధ్యమైనంత తొందరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను పుష్పగుచ్ఛంతో అభినందించారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో నల్ల చెరువు పార్క్ శిలాఫలకం తొలగింపు



కెపిహెచ్‌బి కాలనీ, మే 2, ప్రభాతవార్త

గత ప్రభుత్వ హయంలో కూకట్‌పల్లిలోని నల్లచెరువు అభివృద్ధి పనులు చేపట్టగా దానినీ హైడ్రా ఆధ్వర్యంలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించి పూర్తి చేయగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. అయితే ప్రోటోకాల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఏ పదవీ హోదా లేని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి రమేష్ పేరును శిలాఫలకంపై పెట్టారు. ఈ విషయంపై గత అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రస్తావించి స్పీకర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. జిల్లా స్థాయిలో ప్రోటోకాల్ దక్కాల్సి న ఇద్దరూ ఎమ్మెల్సీ లను కాదని ఏ పదవీ లేని కాంగ్రెస్ నాయకుడి పేరును శిలాఫలకంపై చేర్చడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతే కాకుండా జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు లేఖ రాసి ప్రోటోకాల్ ఉల్లంఘన విషయాన్ని బహిర్గతం చేశారు. ఈ విషయంతో హైడ్రా అధికారులు కంగారు పడటంతో పాటు ఇటీవల కాలంగా హైడ్రాకు అన్ని చోట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్న సందర్భంగా వెనక్కి తగ్గిన హైడ్రా అధికారులు కూకట్‌పల్లి నల్ల చెరువు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని అక్కడి నుంచి తొలగించారు.

ఓటర్ల సర్వే హెల్ప్‌డెస్క్‌లో పాల్గొన్న అడ్డగుట్ట కాంగ్రెస్ నేతలు



జీహెచ్‌ఎంసి నిర్వహించిన హెల్ప్ డెస్క్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నేత గంట రాజు సాగర్

అడ్డగుట్ట,మే 2 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసి,రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో శనివారం అడ్డగుట్టలో నిర్వహించిన హెల్ప్ డెస్క్‌లో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత గంట రాజు సాగర్ పాల్గొని ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వై.కొమురమ్మ, జాఫర్, నర్సింహ యాదవ్,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మరింత ముందుకు : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

మధురానగర్ సాగి రామకృష్ణమరాజు కమ్యూనిటీ హాల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు నవీన్ యాదవ్.

యూసుఫ్‌గూడ మే 2 ప్రభాతవార్త :

ప్రజా సంక్షేమం ప్రభుత్వం అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతుందని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మధురానగర్ సాగి రామకృష్ణమరాజు కమ్యూనిటీ హాల్‌లో ప్రజా పాలనా ప్రగతి ప్రాణాళిక నియోజకవర్గం స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్ బదావత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న సేవలు రాబోయే రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ పాలకులం కాదు సేవకులం అనే నినాదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. మార్చి 6వ తేదీ నుంచి కొనసాగుతున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా నగర అభివృద్ధికి విస్తృత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే సంక్షేమ పథకాలలో భాగంగా కొత్త పెన్షనల్, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, విద్యార్థులకు బ్రేక్ ఫాస్టు రూపంలో రాగి జావి, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ షేక్‌పేట్ ఎమ్మార్వో అనితారెడ్డి, మాజీ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ సర్కిల్ మంచినీటి సమస్యను పరిష్కరించాలి : పాలబిందెల శ్రీనివాస్

డీజీఎం వినాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఐ నాయకులు

నిజాంపేట్, మే 2, ప్రభాతవార్త

నిజాంపేట్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట్ వాటర్ బోర్డు డీజీఎం వినాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజల దాహాన్ని తీర్చాల్సి న అధికారులు సరైన సమయంలో నీటి సరఫరా చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వికార్ సెక్షన్, రాజీవ్ గృహ కల్ప, ఇందిరమ్మ ఇళ్ల కాలనీలు, డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతాల్లో తగినంత నీటి సరఫరా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రగతి నగర్ డివిజన్‌లోని రాజీవ్ గృహ కల్ప వాటర్ ట్యాంక్ నుంచి విజయ్ టింబర్ విల్లాస్ వరకు 5-6 గంటలపాటు మాత్రమే నీటి సరఫరా జరుగుతుండడంతో ఎగువ ప్రాంతాలైన ఇంద్రన్న కాలనీ, ప్రశాంత్ హిల్స్‌కు నీరు అందడం లేదని వివరించారు. ఈ సమస్యకు ప్రధాన కారణం మెయిన్ పైప్‌లైన్‌కు నేరుగా కలెక్షన్లు ఇవ్వడం వల్ల కొన్ని ప్రాంతాలకు ఎక్కువగా నీరు అందుతుండటమేనని పేర్కొన్నారు. అందువల్ల సబ్‌లైన్ ఏర్పాటు చేసి అన్ని కాలనీలకు సమానంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఇందిరమ్మ కార్యదర్శి పొన్నకంటి దస్తగిరి పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో గొప్ప విద్యావంతులుగా ఎదగాలి

జీడిమెట్ల, మే 2, ప్రభాతవార్త

పోటీ ప్రపంచంలో గొప్ప విద్యావంతులుగా ఎదిగి కీర్తి ప్రతిష్టలు పొందాలని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డిఆశీర్వదించారు. శనివారం టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో 2025-2026 విద్యా సంవత్సరానికి చెందిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో 570 నుండి 585 మార్కులు సాధించిన 13 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో, ఛైర్మన్ టి. కోటి రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు పదో తరగతిలో సాధించిన ఉత్తమ ఫలితాలు వారి తల్లిదండ్రులకు గర్వకారణమని అభినందించారు. భవిష్యత్తులో ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా బీటెక్ వంటి ఉన్నత చదువుల్లో కూడా ఇదే పట్టుదలతో ముందుకు సాగితే బంగారు భవిష్యత్తు సొంతమవుతుందని, మంచి ఉద్యోగాల్లో స్థిరపడతారని తెలిపారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ టి. అరుణ కుమారి, అకాడమిక్ డైరెక్టర్ తీపిరెడ్డి సూర రవి చంద్ర రెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న చంద్రకాంతరావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 2, ప్రభాతవార్త

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం దళిత జాతి హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తూ తమ విశిష్టత సేవలు గుర్తుచేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే దళితరత్న అవార్డులు పొందిన ఇడపాక వీరస్వామి, అల్వాల రమేష్, చింత రవిలను శనివారం ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర నగర్‌లోని పీజేఆర్ ఫంక్షన్ హాల్‌లో మోజేష్ అధ్యక్షతన స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ వారి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు సంజీవరెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయనేని చంద్రకాంతరావు ముఖ్య అతిధిగా విచ్చేసి అవార్డు గ్రహీతలను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆర్పి కాలనీ అధ్యక్షులు లింగయ్య, కోశాధికారి యాదగిరి, జోగు పరశురాములు, రాధాబాయి, భూషి, డీజే రాజు, అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్ కొనసాగింపు

ఓటర్ల జాబితాల సవరణ పరిశీలిస్తున్న గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్,ఈచిత్రంలో డిసి ఉమాప్రకాష్,టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి మహేందర్

గోషామహల్,మే 2 ప్రభాతవార్త: ఓటుహక్కు ప్రతి ఒకరు భాధ్యతగా భావించి,అంతేకాకుండా ప్రత్యేకంగా ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులుటి.రాజాసింగ్ క్యాంపు కార్యాలయంలో శ్రీకారం చుట్టారు.జిహెచ్‌ఎంసి డిప్యూటి కమీషనర్ ఉమాప్రకాష్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి మహేందర్‌లు ఎఇఆర్ఓ, బిఎల్ఓ క్యాంపు కార్యాలయంలో ఇంటి నివాసంలో ఓట్లను ఎమ్మెల్యే రాజాసింగ్ పర్యవేక్షణలో పరిశీలిన చేశారు. ఎస్.ఐ.ఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఓటు హక్కును వినియోగించుకనే పోలింగ్ బూత్‌ను ప్రత్యేక విస్తృత పునశ్చరణ(సర్)పనిని చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ ప్రత్యేక విస్తృత పునశ్చరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఒకరు తమ ఓటు ఉందా లేదా తెలుసుకోవచ్చునన్నారు.అంతేకాకుండా బోగస్ ఓట్లు తొలగించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

కుత్బుల్లాపూర్‌లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక



ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

జీడిమెట్ల, మే 2, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కే.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని సభలో వినిపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలోని 10 ముఖ్య అంశాలను ప్రజలకు వివరించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం, విద్యుత్, రేషన్ కార్డులు, పెన్షన్లు, గ్యాస్ సేవలు, అరైవ్ అలైవ్ వంటి పథకాలపై అవగాహన కల్పించారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే నగదు రహిత వైద్య సేవల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పాలు, రాగి జావ అందించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. మైనారిటీ లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, మహిళలకు కుట్టు యంత్రాల పంపిణీ చేపట్టారు. వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు పరిచయం చేశారు.ఈ కార్యక్రమం అనంతరం అతిథులు, ప్రజలకు భోజన సౌకర్యం కల్పించారు.

కాంగ్రెస్ పాలనలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు: జాకీర్‌హుసేన్

కుత్బుల్లాపూర్, మే2 ప్రభాతవార్త : కాంగ్రెస్ పాలనతో నిర్వహించే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలలో భాగంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్నాయని టిపిసిసి లీగల్‌సెల్ కన్వీనర్, మల్కాజ్‌గిరి జిల్లా సెక్రెటరీ మహ్మద్ జాకీర్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ డివిజన్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కొలను హనుమంతరెడ్డి ఆదేశాలమేరకు ప్రభుత్వపథకాల అమలు తీరును ప్రజలకు వివరించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని కొంపల్లి కెవిఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే బహిరంగ సమావేశంద్వారా ప్రభుత్వపథకాల రూపకల్పన, అమలుపై భారీ కార్యకర్తల సమూహంతో సమాయత్త మవుతున్నట్లు తెలిపారు. 284నుండి సత్తాచాటేందుకు ప్రతికార్యకర్త వ్యక్తిగత శక్తిగా ప్రచారాన్ని ముమ్మరంచేయాలని విజ్ఞపి చేశారు.

కార్యక్రమంలో మహిళా డివిజన్ అధ్యక్షురాలు సుజాత, ప్రధానకార్యదర్శి సంగీత, మమత లతోపాటు పెద్దఎత్తున మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్తీ సంక్షేమంపైనే దృష్టి సారించండి : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే2 ప్రభాతవార్త

అభివృద్దే లక్ష్యంగా సంక్షేమ సంఘాలు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై దృష్టిసారించాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం చింతల్ సర్కిల్ వెంకటరామిరెడ్డి నగర్ సంక్షేమసంఘ నూతన అధ్యక్షులు లక్ష్మన్ గౌడ్ ఆధ్వర్యంలో సంక్షేమసంఘ ప్రతినిధులు ఆయనను కలిసి స్థానిక సమస్యలను వివరించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బస్తీ సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడంద్వారా ఆయా బస్తీలు, కాలనీలు వేగంగా అభివృద్ధి చెందుతాయని సూచించారు. కార్యక్రమంలో వెంకట్‌రామిరెడ్డినగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, నూతన కార్యవర్గ సభ్యులు సతీష్ గట్టోజి, మహ్మద్ రషీద్, కార్తీక్‌గౌడ్, బాలూనేత, మోహన్‌రెడ్డి, షాబుద్దీన్, రాజిరెడ్డి, రామకృష్ణ, అన్సారీ, మహాదేవ్, యాదగిరి, వెంకట్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మేషక్‌బాబు, మెహామ్మద్‌బీ పాల్గొన్నారు.

చెరుకుపల్లి కాలనీ కమిటీహాల్ నిర్వాహణపై శ్రద్ధచూపాలి : రమేశ్ యాదవ్

కుత్బుల్లాపూర్, మే2 ప్రభాతవార్త

కమిటీ హాలు నిర్వాహణకు ప్రత్యేకనిధులు కేటాయించి కాలనీ సంక్షేమానికి ప్రత్యేకశ్రద్ధ చూపాలని టిపిసిసి లీగల్‌సెల్ కన్వీనర్, మల్కాజ్‌గిరి జిల్లా సెక్రెటరీ మహ్మద్‌జాకీర్, చెరుకుపల్లికాలనీ సంక్షేమసంఘ ప్రతినిధులు నార్లకంటి రమేయాద్‌లఉ విజ్ఞపి చేశారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హనుమంతరెడ్డికి వినతిపత్రం అందించారు. గతకొన్ని దశాబ్దాలుగా కమ్యూనిటీ హాలు నిర్వాహణ సరిగాలేకపోవడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గణేష్‌నగర్ డివిజన్ 284లోనే అత్యంత ప్రాధాన్యత గల చెరుకుపల్లికాలనీ కమ్యూనిటీహాలు ప్రత్యేకత వుందని దీనికి ప్రత్యేకనిధులు కేటాయించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు.

కూకట్‌పల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మే 2, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం కూకట్‌పల్లిలో ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్స్‌లో వినోద్ సాంఘిక సంక్షేమ శాఖ, విజయ్ కుమారి డిస్టిక్ ఎడ్యుకేటివ్, హనుమంత్ డిప్యూటీ కమిషనర్, స్వామి కూకట్‌పల్లి ఎంఆర్ఓ, శ్రీనివాస్ బాలానగర్ ఎమ్మార్వో, రవీంద్ర మండల్ ఎగ్జిక్యూటివ్, సుబ్బారావు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, అధికారులతో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతస్థాయి అవగాహన కల్పించడం, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థానిక సమస్యలు అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం ఈ సమావేశ లక్ష్యం అంటూ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలు రైతుభరోసా ఇందిరమ్మఇళ్లు మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నరకం వరి బోనస్ చేయూత పెన్షన్లు, కల్యాణలక్ష్మి తదితర పథకాలతోపాటు భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ తరపున హాజరైన టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలే కేంద్రంగా పారదర్శకత ధ్యేయంగా ప్రజల భాగస్వామ్యంతో స్థానిక అభివృద్ధి అవసరాల గుర్తింపు తద్వారా వాటి పరిష్కారం కోసం అవసరమైన కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజల మధ్య నేరుగా సత్సంబంధాల కోసం ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ రెవెన్యూ సిఎంసి పోలీసు తదితర శాఖల అధికారులతో పాటు నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు,ఎస్‌సి సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యం

-కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే

మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ వికాస్ పాండే

పేట్ బషీరాబాద్, మే 2, ప్రభాతవార్త

దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల హక్కులను రక్షి ంచడమే ఏకైక లక్ష్యంగా కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ నిరంతరం శ్రమిస్తోందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే వెల్లడించారు. శనివారం మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నూతన అధ్యక్షుల నియామకం సందర్భంగా సుచిత్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. వినియోగదారులు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటికి ఉన్న పరిష్కార మార్గాలపై ఆయన విపులంగా చర్చించారు. భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన తమ సంస్థ ప్రస్తుతం 23 రాష్ట్రాల్లో సేవలు అందిస్తోందని, ఇప్పటివరకు కన్స్యూమర్ కోర్టుల్లో 464కు పైగా కేసులను దాఖలు చేశామని ఆయన పేర్కొన్నారు. దేశం నలుమూలలా 1,600లకు పైగా అవగాహన సదస్సు లు నిర్వహించి వేలాది మంది కొనుగోలుదారుల్లో చైతన్యం తీసుకువచ్చామన్నారు. కల్తీ ఆహారం, గడువు తీరిన (ఎక్స్‌పైరీ) వస్తువుల అమ్మకాలు, ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించడం వంటి మోసాలపై బాధితులు ఫిర్యాదు చేయవచ్చని, తమ సంస్థ దీనికోసం ఎటువంటి రుసుము లేకుండా ఉచిత సేవలు అందిస్తుందని ఆయన వివరించారు.

ఉచిత న్యాయ సేవలు

వినియోగదారులు మోసాలకు గురైనప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి పెద్దగా ఖర్చు కాదని డాక్టర్ పాండే తెలిపారు. ఐదు లక్షల రూపాయల లోపు విలువైన కేసులకు ఎలాంటి కోర్టు ఫీజు చెల్లించాల్సి న అవసరం లేదని ఆయన గుర్తుచేశారు. ఒకవేళ బాధితులు నేరుగా కోర్టుకు వెళ్లలేని పరిస్థితి ఉంటే, తమ కౌన్సిల్ పక్షాన ఉచితంగా న్యాయవాద సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వస్తువులు, సేవల విషయంలో కొనుగోలుదారులకు ఎలాంటి అన్యాయం జరిగినా జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలోనూ తమ సంస్థ వినియోగదారులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా, శనివారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో వినియోగదారుల హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ రిజ్వాన్, రత్నరాజు, సాయి సతీష్, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత బలోపేతంతో బిజెపి మరింత బలపడుతుంది : నరేంద్ర చౌదరి

నిజాంపేట్, మే 2, ప్రభాతవార్త

సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం ద్వారా భారతీయ జనతా పార్టీ మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి తెలిపారు.శనివారం భారతీయ జనతా పార్టీ వివిధ మోర్చాలకు అధ్యక్షుల నియామక కార్యక్రమం నిర్వహించగా, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మోక్షశ్రీను, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి చేతుల మీదుగా నియమించారు. అలాగే సోషల్ మీడియా కన్వీనర్‌గా నల్లమల్ల వెంకట్‌ను మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి ఎస్. మల్లారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని నరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్‌కు చెందిన దొడ్డ పవన్, వారి మిత్రబృందం పార్టీ సభ్యత్వం స్వీకరించారు. వీరికి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పారిశుద్ధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనివి



చిక్కడపల్లి మే 2 ప్రభాతవార్త : సమాజం కోసం పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలే నివని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారు, మాజీ ఎంపీ వి.హనుమంత రావు అన్నా రు. శనివారం బాగ్ లింగం పల్లి చౌరస్తాలో టీపీసీసీ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చైర్మన్‌గా రాజేష్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సత్కరించి అభినందించే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు లక్ష్మణ్ వర్మ, నవ్వ రాజు, అంజి యాదవ్, నర్సింగ్ రావు, రఘువీర్, వి.నాగభూషణం, రాములు ముదిరాజ్, గంగాధర్, వెజ్ శ్రీనివాస్, పెల్లి సాయి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హను మంత రావు మాట్లాడు తూ చైర్మన్‌గా రాజేష్ కుమార్ అగర్వాల్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషి స్తున్నారని ప్రశంసించారు. గత ఒక సంవత్సరం కాలంగా రాజేష్ కుమార్ కేవ లం రాజకీయాలకే పరిమి తం కాకుండా, ప్రతి నెలా ఏదో ఒక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తూ అంకితభావంతో పనిచేస్తున్నారని వీహెచ్ కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల కాంగ్రెస్ పార్టీ సామాన్య ప్రజలకు మరియు కార్మికులకు మరింత చేరువవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

EE-Cir42/EE/SBZ/GHMC

నిట్ నం. 03/Cir-42/Engg/SBZ/GHMC/2026-27, తేదీ: 01.05.2026, పని పేరు: GHMC సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట సర్కిల్-42లో విద్యుత్ పనులు. మొత్తం టెండర్ సొమ్ము: రూ.4,08,988.00. క్ర.సం.1, ప్రారంభ తేదీ: 02.05.2026 మ.3.00 గం. నుండి, బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 08.05.2026 మ.3.00 గం. వద్ద. శ్రీమతి D. ఆశాలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నం.42, అంబర్‌పేట, సికింద్రాబాద్ జోన్, GHMC, సెల్: 9963550657, 6309920591. సంబంధిత EE చిరునామా: Cir-42, SBZ, GHMC అబిడ్స్, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, Cir-42, GHMC,
DIPR.No.1798-PP/CL/Advt/1/2026-27, తేది: 02.05.2026

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

నిట్ నం. సంక్షిప్త టెండర్ ప్రకటన నం: 01/EE(ప్రాజెక్టులు)/GHMC/2026-27, తేదీ: 30.04.2026. (7 రోజులు). ఐటమ్ నం.1. పని పేరు: డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ నుండి నాగబౌలికు 40 వెడల్పు రోడ్ ప్రతిపాదన వలన ప్రభావితమయ్యే (14) నం.ల ఆస్తుల పడగొట్టుట. సొమ్ము (రూ.లక్షలలో) 9.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 03.05.2026 సా.04.00 గం. వద్ద. డౌన్‌లోడ్ ముగింపు తేది: 12.05.2026 మ.03.30 గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 12.05.2026 సా.04.00 గం. బిడ్ తెరచు తేదీ: 12.05.2026 సా.04.30 గం. వద్ద. అధికారి పేరు & చిరునామా, సెల్ నం: శ్రీమతి Ch. సంపద EE, ప్రాజెక్టులు, GHMC, ట్యాంక్‌బండ్, హెడ్ ఆఫీస్, హైదరాబాద్, 7995009112. మొత్తం: 9.00. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), GHMC
DIPR.No.1813-PP/CL/Advt/1/2026-27, తేది: 02.05.2026

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II
TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD
S.A. NO. 554 OF 2025

Between:
K. Madhu, R/o. H.No.1-9-78, Sri Vijaya Nagar Colony, Suryapet District ...Applicant

And
1). Indusind Bank
2). M/s. Vaishali Enterprises
3). Mr. Chityala Ramulu
4). Smt. Chityala Padma ...Respondents

NOTICE

To,
1). **M/s. Vaishali Enterprises,** Shop No. 8-5-290, Opp: City Cafe Hotel, OPP: City Cafe Hotel, Old Bowenpally, Secunderabad. **Also at** P No. 148/P, Jayabheri Park, Kompally, Secunderabad
2). **Mr. Chityala Ramulu,** S/o. Raja Reddy, Flat No. 201, 2nd Floor, Sri Venkateshwara Towers, **Sri Chaitanya Academy,** Bahadurguda Village, Saroornagar, LB Nagar, Ranga Reddy District.
3). **Smt. Chityala Padma,** W/o. Chityala Ramulu, Flat No. 203, Celebrity Homes, Godavari Homes, Jeedimetla, Suchitra, Hyderabad. **Also at** Flat No. 101, First Floor, Sai Nilayam, Opp: Game Theory, Beside Alef Musicals, Churchlane, Jayabheri Park, Kompally, Secunderabad-500100

Take notice that the Applicant herein has filed the above SA challenging the measures initiated by the Respondent No.1 under the SARFAESI Act., and Rules 2002. The above named Respondent No.2 to 4 directed to appear on **15.06.2026 at 11.00A.M.,** before the Debts Recovery Tribunal-II, at 1st Floor, Triveni Complex, Abids, Hyderabad, either in person or through an advocate or authorized agent to show cause as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the above S.A No. 554 of 2025 will be heard and determined in your absence.

B. Sreenivasa Reddy
Advocate
Counsel for the Applicant
Date: 29.04.2026
Place: Hyderabad

IN THE COURT OF THE HON'BLE XVIII ADDL SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S. No. 553 OF 2025

Between:
Bank of Baroda, Charminar Branch
Rep. by its Chief Manager,
Office at # 22-7-294, 1st Floor,
Nizambagh, Diwan Deodi, Charminar,
Hyderabad, Telangana - 500 002 ...Plaintiff

AND
Mr. Gajula Sandeep
S/o. Gajula Venkatesh, Age: 35 Yrs,
Occ: Employee at TS Police Department
R/o. H No. 17-1-391/S/507, Flat No. 102,
Sri Sai Laxmi Residency,
Singareni Colony, Hyderabad,
Telangana District - 500 059
Ph No. 9949267281 ...Defendants No.1 to 2

NOTICE

The General Public are hereby informed that the petitioner/Plaintiff has filed a petition for the recovery of money. The Hon'ble Court has scheduled the matter for objections on or before **25-06-2026** at 10:30 A.M. Any person having objections to the said petition may appear before the Hon'ble Court in person or through a pleader duly instructed on the aforementioned date and time to present their objections.
Please note that in the event of failure to appear on the scheduled date, the matter shall be heard and decided in your absence.

V. EKANTHA RAO
B. NARASINGA RAO , ADVOCATE
office : Hno. 1-88/10/1, Ratna Nilayam, Landmark: Shabari Gardens, Malikarjunnagar, Parvathapur, Medipally Hyderabad -500 098

CAUTION NOTICE

Public is hereby informed that M/s. Shakil Industries, Hyderabad, is the sole proprietor and registered owner of the trademark "KARACHI MEHNDI" (Regd. No. 574697, Class 03) and copyright of its label. It has come to the notice of the Proprietor that certain persons namely: Goutham Kumar, Surender @ Santosh @ RV, Ruparam Godara, Punmaram, Shiva, Mohd. Abdul Waseem, Yasin @ M.D. Yasin, Mohsin @ M.D. Mohsin, M.D. Jaffar, M.A. Waseem, Vasnaram Devasi, M.D. Ibrahim, Omkari Rahul, Deepak Kumar, Asif, Shanti Lal Jain, Vipul Mehta Jain & Raju Mehta Jain, Against whom FIRs and criminal cases have been registered by police authorities and multiple raids have been conducted by the Task Force, and the alleged products have been seized from the possession in relation to dealing with products bearing the mark "KARACHI MEHNDI", are stated to be involved in such activities. The matter is subject to ongoing legal proceedings. General public and trade are cautioned not to deal in such products. Any person doing so shall be at their own risk as to costs and consequences. Any person having information regarding the manufacture, sale or distribution of products falsely bearing the trademark "KARACHI MEHNDI" may contact the undersigned. Genuine information may be suitably rewarded and confidentiality will be maintained. Proprietor shall not be responsible for such dealings

Mohammed Maqdoom
Advocate,
Office :Flat No.402,4 th Floor,A.N.Square Pillar No.214,Rajendranagar X Road, Hyderabad. Ph: 7799057500
M/s SHAKIL INDUSTRIES

దళితుల సంక్షేమం కోసం కృషి : గోపాల్

దళిత రత్న అవార్డు గ్రహీత గోపాల్ ను సన్మానిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు శ్యామ్ రావు, బట్టు దాస్ రావు, బొట్టు శ్రీనివాస్, గడ్డం నందు, దేవులపల్లి శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, మే 2, ప్రభాతవార్త:
దళితులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమ సంఘం కృషి చేస్తామని దళిత రత్న అవార్డు గ్రహీత, ఆస్మాన్ ఘాడ్ డివిజన్ హామాలీ బస్తి సంక్షేమ సంఘం నాయకులు గోపాల్ పేర్కొన్నారు. దళిత రత్న అవార్డు అందుకున్న సందర్భంగా ఆస్మాన్ ఘాడ్ డివిజన్ హామాలీ బస్తీ లో జరిగిన కార్యక్రమంలో గోపాల్ ను దళిత గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు బట్టు దాస్ రావు, నాయకులు శ్యామ్ రావు, బొట్టు శ్రీనివాస్, గడ్డం నందు తదితరులు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం పాటుపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అస్మాన్ ఘాడ్ డివిజన్ హామాలీ బస్తి ఆస్మాన్ ఘాడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవులపల్లి శ్రీనివాస్, చుంచు రాజు,నర్సింగ్ డాన్, ప్రభాకర్, కృష్ణ, దేవేందర్, కృష్ణమూర్తి,నరసింహ, ప్రభాకర్, దేవేందర్, నర్సింగ్, కృష్ణమూర్తి, ప్రభాకర్, మధు, శ్రీరామ్, సిహెచ్ రాజు, బొజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల చిత్రంలో అధికారులు తదితరులు

మలక్ పేట, మే 2, ప్రభాతవార్త:
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మలక్ పేట నియోజకవర్గం మలక్ పేట అఫ్జల్ నగర్ కమ్యూనిటి హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొంత మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందగా, మిగిలిన వారికి అంద లేదని వారందరికీ కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు సైతం మరలా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ఇంకేషాఫ్ అలీ, అలివేలు మంగతాయారు, సైదాబాద్ మండల తహసిల్దార్ మాణిక్ లాల్, మాజీ కార్పొరేటర్లు సలాం షాహిద్, మినాజ్, నాయకులు సైఫుద్దిన్ షఫి, అబ్రార్ ,శ్రీనివాస్, అన్వర్ పాష తదితరులతో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

మల్కాజిగిరి మే 2, ప్రభాతవార్త
మల్కాజ్‌గిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం కీలక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ ఫైర్ సర్వీసెస్ ఆఫ్ హైడ్రా పాపయ్య వర్మ , డిప్యూటీ సిటీ ప్లానర్ రాంరెడ్డిలను మర్యా దపూర్వకంగా కలుసుకుని నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గంలో పెరుగు తున్న భూకబ్జాలు,అక్రమ నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఎదురవు తున్న ఆటంకాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అల్వాల్ ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కోర్టు స్టే కారణంగా నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామ కంఠం భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బండ చెరువు పరిరక్షణ, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చెరువుల పరిరక్షణ, ఆధునీకరణ పనులకు సంబంధించి కోర్టు స్టే సమస్యలను పరిష్కరించాలని కోరగా ఈ విషయాలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బిజెపిలో చేరిన రోజారాణి వడ్లమూడి

నేరెడ్ మెట్ మే 2, ప్రభాతవార్త
తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కే . రామచంద్ర రావు నేతృత్వంలో ప్రముఖ వ్యాపార వ్యూహకర్త, వ్యాపారవేత్త రోజారాణి వడ్లమూడి భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సుమారు పద్దెనిమిది సంవత్సరాల అనుభవం కలిగిన రోజారాణి వడ్లమూడి మీడియా నిర్వహణ, వ్యాపార అభివృద్ధి, మానసిక మార్గదర్శకత్వ రంగాల్లో నైపుణ్యం సంపాదించారు. వివిధ రంగాల్లో సంపాదించిన అనుభవాన్ని సామాజిక సేవకు వినియోగించాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా బాధ్యతాయుత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం, మహిళా సాధికారతను ఆర్థిక స్వావలంబనతో అనుసంధానించడం, సహజ వనరుల సంరక్షణకు కట్టుబడి పనిచేయడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఈ అంశాల్లో పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు తనకు అనుసరణీయంగా అనిపించాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలన, ఆత్మనిర్భర్ విధానాలు తనను ప్రభావితం చేశాయని తెలిపారు. పార్టీ వేదిక ద్వారా తన వ్యూహాత్మక దృష్టి, అనుభవాన్ని వినియోగించి సమాజానికి విలువ సృష్టించడం, ఉపాధి అవకాశాల పెంపు, తెలంగాణలో స్థిరమైన అభివృద్ధికి కృషి చేయడం తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో 99 రోజుల కార్యాచరణపై సమీక్ష

-ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం వద్దు
: జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

నేరెడ్ మెట్,మే 2, ప్రభాతవార్త :
మల్కాజిగిరి పరిధిలోని బృందావన్ గార్డెన్స్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ హాజరై వివిధ శాఖల పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు చేరువగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం జి.ఓ. నం. 3 ప్రకారం ప్రతి సోమవారం నియోజకవర్గాల వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనాభా లెక్కల నమోదు, " సర్ "ద్వారా ఓటర్ నమోదు ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రెవెన్యూ శాఖలో ధరణి పెండింగ్ దరఖాస్తులు, మ్యుటేషన్లు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీని శాతానికి శాతం పూర్తి చేయాలని, భూ సమస్యల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ శాఖలో పారిశుద్ధం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ నిర్వహణపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని, వార్డు వారీగా శానిటేషన్ డ్రైవ్‌లు చేపట్టాలని చెప్పారు. సివిల్ సప్లైస్ శాఖలో కొత్త రేషన్ కార్డులు, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ ప్రక్రియలను పూర్తి చేసి, దరఖాస్తులను 7 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖలో బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలలో మందుల లభ్యత, వైద్యుల హాజరు నిర్ధారించాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు, స్థల పరిశీలన వేగవంతం చేయాలని, మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను క్లియర్ చేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని అన్నారు. విద్యుత్ శాఖలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం నమోదు పూర్తి చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు సమయానికి నిర్వహించి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. పోలీస్ శాఖలో శాంతిభద్రతల సమస్యలను పరిష్కరించడమే కాకుండా డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి శాఖకు కేటాయించిన పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి ఝాన్సీ రాణి, తహసీల్దార్లు సీతారాం, రాములు, డిప్యూటీ కమిషనర్ శ్రీమతి జకియా సుల్తానా, ఎంఈఓలు మురళీకృష్ణ, మనోహర్, అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ సంధ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రగతిపాలనలో పథకాలు విజయవంతం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పొదుపు సంఘాల మహిళలకు చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జెడ్‌సి రాధిక గుప్తా, డిసి శైలజ తదితరులు

ఉప్పల్, మే 2 ప్రభాతవార్త : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, స్పెషల్ ఆఫీసర్, జిల్లా డి ఆర్ డి ఓ సాంబశివరావు, ఉప్పల్ సర్కిల్ డి.సి. శైలజ, ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహన్ ఆర్‌టిఒ రవీందర్ రెడ్డి, మండల విద్యాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా సిఎం రేవంత్‌రెడ్డి సందేశం పంపించారు. వివిధ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి డిప్యూటి కమిషనర్ శైలజ సభ్యులకు వివరించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు బోర్ అనుమతులు సకాలంలో ఇవ్వడం లేదని పలువురు ఫిర్యాదు చేయగా, దీనిపై తహసీల్దార్ వివరణ కోరగా బోర్ పర్మిషన్లు తొందరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ ఏఈ వివరణ కోరగా ఎల్ వన్ ఎల్ టు ఎల్ త్రీ మూడు రకాలుగా లబ్ధిదారుల జాబితా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఎల్ వన్ జాబితా లబ్ధిదారుల విచారణ జరుగుతుందని, త్వరలోనే వారికి మంజూరు పత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పెడుతున్నామని మండల విద్యాధికారి రామరావు తెలిపారు. అనంతరం ఉప్పల్ పరిధిలోని కాప్రా, నాచారం సర్కిల్ లకు సంబంధించిన 66 మహిళా సంఘాలకు రూ.6 66 లక్షల రూపాయలు బ్యాంకు రుణాలకు చెక్‌లను మహిళా సంఘాలకు అందజేశారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ప్రస్తుతం 33 మంది లబ్ధిదారులు చెక్కులు ఉన్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరముల నుండి ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి చెక్‌ల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి : శంకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బిజెపి కో–ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొలన్ శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 2 ప్రభాతవార్త: ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడి బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ బిజెపి కో–ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొలన్ శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బడంగ్‌పేట్ సర్కిల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడవ సారి దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా హైదరాబాద్ పర్యటనకు విచ్చేస్తున్న మోడి మే 10వ తేదీన తెలంగాణలో సుమారు రూ.8 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వెల్లడించారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటెల రాజేందర్, డికె అరుణ, ధర్మపురి అరవింద్, అసెంబ్లీ బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితర ముఖ్యుల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బహిరంగ సభకు మోడీ హాజరై రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు. దాదాపు మూడు లక్షల మంది ఈ సభకు ప్రజలు హాజరవుతారని పార్టీ అధిష్టానవర్గం భావిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ సభలో కాంగ్రెస్, విపక్షాలు మహిళలకు, రైతులకు, యువతకు, బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేసిన దగాను ఎండగడతారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ మోర్చాల శ్రేణులు, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి మోడీ సభను విజయవంతం చేయాలని శంకర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, నాయకులు సురేష్, రామిడి మహేందర్‌రెడ్డి, లక్ష్మణరాజు, శాకిరి భాస్కర్ పాల్గొన్నారు.

సమాజంలో డ్రగ్సును అరికట్టేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలి : అడిషనల్ డిసిపి వెంకటరమణ



కుషాయిగూడ మే 2, ప్రభాతవార్త : రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని మల్కాజ్గిరి కమిషనరేట్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. శనివారం కుషాయిగూడలో విబిఎస్ ట్రస్ట్, కుషాయిగూడ పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో డ్రగ్స్ మహమ్మారితో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని డ్రగ్స్ ను కఠినంగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి డ్రగ్స్ మత్తులో పడి యువత అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వారిని మార్చేందుకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు యాజమాన్యం కట్టడి చేయాలని తెలిపారు. గంజాయి డ్రగ్స్ తో కలిగే దుష్ప్రభావాలను వారికి వివరించి డ్రగ్స్ జోలికి వెళ్లకుండా నియంత్రించాలని కోరారు. ఈ సందర్భంగా విబిఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్లోజు జ్యోతిర్మయి చారి పారిశుధ్య కార్మికులకు పోలీస్ మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, బొంతు శ్రీదేవి యాదవ్, గొల్లూరి అంజయ్య, ఎస్సైలు వెంకన్న, సుధాకర్ రెడ్డి సునీల్ రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య తీరుతో అధికార వ్యవస్థపై నమ్మకం పోయింది : పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న సీనియర్ బిజెపి నేత పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 2 ప్రభాతవార్త: కోట్లాది రూపాయల అవినీతి అక్రమాలు జరిగిన బడంగ్‌పేట్‌లో అధికార పార్టీ నేతలకు అడుగులకు మడుగులొత్తే విధంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ కమీషనర్ సమ్మయ్యపై వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని బడంగ్‌పేట్ సర్కిల్ బిజెపి సీనియర్ నాయకుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. జన గణనకు సంబంధించిన యాప్‌ను మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డితో ప్రారంభించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో సమావేశమైన ఆయన డిసి తీరుపై నిరసన వ్యక్తం చేశారు. బడంగ్‌పేట్‌లో 122 కోట్ల అవినీతి జరిగిందని అధికారికంగా నిరూపితమైనా కూడా బాధ్యత గల డిప్యూటీ కమీషనర్ అధికార పార్టీ నేతలకు అడుగులకు మడుగులు వత్తే విధంగా ప్రవర్తించడం శోచనీయమన్నారు. అవినీతి వల్ల బడంగ్‌పేట్‌లో ఇప్పటికే పాలకవర్గం, అధికారులపై నమ్మకం పోయిందనీ అయితే తాజాగా కొత్త డిసి తీరు వల్ల అధికార వ్యవస్థపై విశ్వాసం మరింత పోయిందని ఆయన అన్నారు. జన గణన యాప్‌ను ప్రారంభించిన తర్వాత బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఏదో తతంగం నడుస్తుందని బిజెపి భావిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. డిసి వ్యవహారంపై జిహెచ్‌ఎంసి కమీషనర్ కఠినంగా వ్యవహరించాలనీ ఈ మేరకు సమ్మయ్యను సస్పెండ్ చేయాలని శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

జిల్లెలగూడలో వైభవంగా రథోత్సవం

జిల్లెలగూడ పుర వీధుల్లో రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తున్న దృశ్యం

సరూర్‌నగర్, మే 2 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ గ్రామంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ఇఒ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా రథోత్సవ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరు కళ్యాణోత్సవం జరిగిన స్వామి, అమ్మ వారి ఉత్సవ విగ్రహాలను జిల్లెలగూడ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో ఆలయ మాజీ ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ ఫెరేడ్ గ్రౌండ్లో ఈనెల 10వ తేదీన జరిగే జన ఆగ్రహ సభను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు. నాగోల్ డివిజన్ శుభం కన్వెన్షన్ హాల్లో శనివారం బిజెపి ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ 10వ తేదీన జరిగే సభకు భారత ప్రధాని నరేంద్రమోడీ హాజరవుతారని తెలిపారు. సభకు వేలాదిగా తరలిరావాలని నాయకులకు వారు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు సామ రంగా రెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, వస్పరి మల్లేష్, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు.

గరీబోళ్లకు అండగా ఉప్పల ఫౌండేషన్ : ఉప్పల

పుస్తె మాటలా అందజేస్తున్న ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త:
నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన బుచ్చయ్య, గజ్జె లచవ్వ కుమార్తె వివాహానికి అవసరమైన చీర, పూస్తేమట్టెలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, ఆయన సతీమణి ఐవిఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలవడం సంతోషంగా వుందన్నారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎంతో మంది పేద కుటుంబాలకు అండగా ఉంటూ వివాహానికి అవసరమైన పూస్తే మట్టెలు, చీరే, గాజులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, దళిత సంఘం నాయకులు లింగం పాల్గొన్నారు.

విహెచ్‌కు శుభాకాంక్షలు తెలిపిన నల్ల రఘుమారెడ్డి

విహెచ్‌ను సన్మానిస్తున్న హనుమాన్ దేవాలయ పాలకమండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

సైదాబాద్, మే 2 ప్రభాతవార్త: బిసి సంక్షేమ శాఖ సలహాదారుడిగా నియమితులైన వి.హనుమంతరావును శనివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ పాలక మండలి మాజీ ఛైర్మన్ నల్ల రఘుమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రఘుమారెడ్డి మాట్లాడుతూ విహెచ్ నియామకం కేంద్రంలో బిసిల హక్కుల సాధనకు మరింత బలాన్నిస్తుందన్నారు. బిసిల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలకు విహెచ్ మార్గదర్శకత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విహెచ్‌కు అభినందనలు తెలిపిన వారిలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు గౌతమ్ రెడ్డి, సామ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది : ఎమ్మెల్యే

ఎల్‌ఓసి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, మే 2 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ జనప్రియ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి తమ పరిస్థితిని వివరించి సహాయం చేయాల్సిందిగా కోరారు. దీంతో వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్‌ఫండ్ నుండి మంజూరైన రూ. 2లక్షల ఎల్‌ఓసి చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని అన్నారు. పేద ప్రజలు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు పొందడానికి సిఎం సహాయనిధి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు మాధవరం నర్సింహారావు, రుద్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బినగర్ జడ్‌సిని కలిసిన దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి



జడ్‌సి వికాస్ మహతోకు శుభాకాంక్షలు తెలుపుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, మే 2 ప్రభాతవార్త:
ఎల్‌బినగర్ జోనల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వికాస్ మహతోను లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి నగర పాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కోసం వేసవి శిక్షణ శిబిరాలు : రజితరెడ్డి

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో సర్టిఫికేట్లు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

ఉప్పల్, మే 2 ప్రభాతవార్త :
వేసవిలో చిన్నారుల కోసం ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లోని చర్చిలో వేసవి శిక్షణ శిబిరాలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం రజితరెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం, వినోదం, వికాసం పొందవచ్చున్నారు. ఈ శిబిరాలతో విద్యార్థులలో కొత్త నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులతో దాగి ఉన్న సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, స్వతంత్రత కూడా పెరుగుతుందని తెలిపారు. ఇళ్లల్లో చిన్నారులు ప్రసార సాధనాలకు అలవాటు అయ్యే అవకాశం ఉంటుందని, దీనికి దూరంగా ఉంచాలని సూచించారు. సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన చిన్నారులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభాకర్, సల్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ఎల్.బి.నగర్, మే 2 ప్రభాతవార్త:
ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గం స్థాయి సమావేశం చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీలోని మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు చేరువేతలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్‌మహతో, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్‌రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రజలకు జనగణన 2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పైన జోనల్ కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.శశిధర్‌రెడ్డి, డాక్టర్ బి.విజయరంగా, దాము మహేందర్‌యాదవ్, వెంకటేష్‌చారి, రమేష్, ఆదిత్య, సంతోష్, నాగార్జున, సుధాకర్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనాలకు మహర్దశ : బన్నాల గీత

బాలాజీ ఎన్‌క్లేవ్‌లో పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్, మే 2 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని బీరప్ప గడ్డ డివిజన్ బాలాజీ ఎంక్లేవ్, రాఘవేంద్ర నగర్ కాలనీలో పార్కులో అభివృద్ధి పనులను శనివారం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలాజీ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రనగర్ కాలనీల మధ్యలో ఉన్న ఉద్యానవనంలో వాకింగ్ ట్రాక్, బెంచీలు, పూల మొక్కలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పార్కుకు సీనియర్ సిటిజన్స్ ఉద్యానవనంగా నామకరణ చేసి వారికి ఇండోర్ గేమ్స్ ఆడుకునే విధంగా నూతన బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నపిల్లలకు ఆట పరికరాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయమని స్థానికులు విన్నవించినట్లు తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఈ ఉద్యానవనాన్ని ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు ఈ.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కె.జగన్, కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి ,రమణ గుప్తా, హార్టికల్చర్ విభాగం సిబ్బంది బాలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు

విజయ డైరీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న గుత్తా అమిత్ రెడ్డి.

వనస్థలిపురం. మే.2.ప్రభాతవార్త :
మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించే దిశగా హయత్ నగర్ సర్కిల్ వనస్థలిపురంలోని మహిళా థీమ్ పార్క్ ప్రాంగణంలో కీలక కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన యూసీడీ విభాగం ఆధ్వర్యంలో శనివారం మదర్ థెరిసా మహిళా సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి యూసీడి అదనపు కమిషనర్ రఘుప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం, ఆర్థికంగా బలపడేలా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అమిత్ రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, ఉపాధి సృష్టి, మరియు స్వయం ఆధారిత జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు ఎంఎంసి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, యూబీడీ డైరెక్టర్ సునంద, యూసీడీ పీడీ సురేష్ కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు మరియు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మలక్ పేట్ ఏసిపిగా బాధ్యతలు చెప్పిన చేపట్టిన ఎల్. రాజా వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న మలక్ పేట్ ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ